ఊరెళ్తే సమాచారమివ్వండి

కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్

కాచిగూడ, జనవరి 11: సంక్రాంతి పండుగకు ఊళ్లకు వెళ్తున్న ప్రజలు దొంగతనాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్ అన్నారు. శనివారం పీఎస్‌లో మాట్లాడుతూ.. కాచిగూడ పీఎస్ పరిధిలో తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే కాచిగూడ పీఎస్‌కు సమాచారం అందించాలని కోరారు. ఇంటి డోరుకు మల్టిపుల్ సెంట్రల్ లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని, ఇంట్లో బంగారం వంటి విలువైన వస్తువులు, డబ్బులు ఉంచకుండా బ్యాంక్ లాకర్లో పెట్టుకోవాలని కోరారు. బస్తీ, కాలనీలలో వాచ్‌మెన్ ఉన్న అపార్ట్‌మెంట్లలోకి పరిచయంలేని వ్యక్తులు వచ్చినా ఎవరు పట్టించుకోవడం లేదని, అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు ఊరికి వెళ్లాల్సి వస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందిస్తే వారి ఇంటికి తగిన రక్షణ కల్పిస్తామని సీఐ తెలిపారు. ఆయా ప్రాంతాలలో రాత్రి సమయాల్లో ఫెకెటింగ్ టైంను పెంచుతామని, దానికి తోడు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. సహాయం కోసం 8712660540లో సంప్రదించాలని కోరారు.

పురస్కారాలు ప్రదానం

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వార్షికోత్సవం సందర్భంగా పలువురికి అవార్డులు ప్రదానం చేస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 11 : తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ 13వ వార్షికోత్సవాలు అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో శనివారం ఘనంగా జరిగాయి. మహా కవి సినారే కళాపీఠం సాహిత్య సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేకేడి రాములును తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డుతో సత్కరించారు. ఆర్టీసీలో ఉత్తమ సేవలందిస్తున్న పలువురు డైవర్లను గుర్తించి సత్కరించారు. రికార్డ్స్ అధినేత డాక్టర్ చింతపట్ల వెంకటాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న లబ్ధప్రతిష్టులైన పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు.

ముగ్గుల పోటీలు

అబిడ్స్, జనవరి11 : దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి ఉత్సవాలలో భాగంగా గన్‌ఫౌండ్రీ డివిజన్‌లో కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాశ్ అధ్వర్యంలో మహిళలకు విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమ్మెల పాండు యాదవ్, ఓంప్రకాశ్, అరుణ జ్యోతి, జ్ఞానేశ్వర్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

నాలా కుంగుబాటుకు అధికారులదే బాధ్యత

గోషామహల్‌లోని చాక్నావాడి నాలా వద్ద ధర్నా చేస్తున్న గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్ కుమార్‌గౌడ్ తదితరులు

- ఇలా నిర్మించడం అలా కుంగిపోవడం పరిపాటిగా మారిందని ఆగ్రహం
- ప్రజా ధనం వృథా చేస్తున్నారని నిలదీత
- ఏదైనా జరుగరానిది జరిగితే ఎవరు బాధ్యులు
- ఇప్పటికైనా శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలి
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనంద్ కుమార్‌గౌడ్ డిమాండ్

కార్వాన్, జనవరి11 : గోషామహల్ నియోజకవర్గంలోని చాక్నావాడిలో రెండు నెలల క్రితం నాలా కుంగిపోయింది. దీంతో అధికారులు టెండర్లు పిలిచి తిరిగి నాలాను నిర్మిస్తున్నారు. కాగా ఈ నాలా పనులు సాగుతుండగానే సమీపంలోని నాలా శుక్రవారం కుంగిపోవడంతో అక్కడ నిలిపి ఉన్న రెడీమిక్స్ వాహనం నాలాలో పడిపోయింది. ఈ విషయమై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం. అనంద్ కుమార్‌గౌడ్ శనివారం ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు.

నాలా కుంగుబాటుకు సర్కిల్-14 డీఎంసీ పూర్తి బాధ్యత వహించాలి..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలా కుంగిన ఘటనకు సర్కిల్-14 డీఎంసీ పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నాలా కుంగిపోయిందని వెంటనే డీఎంసీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా చాక్నావాడి నాలా రెండు సార్లు కుంగిపోయిందని తాజాగా మరోసారి కూలిందంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన నిలదీశారు.

నాసిరకంగా నిర్మించడం వల్లే ఇలాంటి ఘటనలు..

అధికారులు బాధ్యత తీసుకోకుండా నాసిరకంగా నాలాలు నిర్మిస్తున్నా చూసీచూడనట్లు వదిలేయడంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ప్రజల ప్రాణాలలో చలగాటమాడటం తగదని ఆయన హితవు పలికారురు. ఒకవేళ ప్రాణ నష్టం జరిగి ఉంటే దానికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ప్రియాగుప్తా, ఆవుల వినోద్‌యాదవ్, విజయ్‌ముదిరాజ్, మహేశ్‌గౌడ్, రాము, శంకర్, నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

డాక్టర్ హరిసర్వోత్తమను సన్మానిస్తున్న కళాశాల కార్యదర్శి కిషన్‌బద్రుక తదితరులు

కాచిగూడ,జనవరి 11: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సర్వే ఆఫ్ ఇండియా జియోలాజికల్ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హరిసర్వోత్తమ అన్నారు. కాచిగూడ బద్రుక గ్రూప్ ఆఫ్ కళాశాలల ఆధ్వర్యంలో శనివారం సన్నిహిత్ కార్యక్రమంలో భాగంగా వివిధ క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు అనాథాశ్రమాల విద్యార్థులు క్రీడల్లో పాల్గొని ప్రతిభను చాటారు. ముఖ్యఅతిథులుగా హరి సర్వోత్తమ, డెంటల్ సర్జన్ వికాస్ బీవీజే హాజరై మాట్లాడుతూ విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యతను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ లక్ష్మీనివాస్ శర్మ, గౌరవ కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక, గౌరవ కార్యదర్శి ఎస్‌జీజీబీఈఎస్, జాయింట్ కార్యదర్శి రవిబద్రుక, డైరెక్టర్ జనరల్ అభిరామకృష్ణ, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు

కాచిగూడ, జనవరి 11: ఓ ఇంట్లో మూడు ముక్కలాట ఆడుతున్న 5 గురు పేకాట రాయుళ్లపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడకు చెందిన కరణ్, సాయి, వెంకటేశ్, శ్రీకాంత్, శ్రీధర్ లు కొన్ని రోజులుగా కాచిగూడ చెప్పల్‌బజార్‌లోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా మూడు ముక్కలాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఇంట్లో సోదాలు చేయగా రూ.4,760, 5 ఫోన్లు, 52 ప్లే కార్డులు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకొని ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హుమాయూన్‌నగర్ పరిధి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్ తదితరులు

మెహిదీపట్నం జనవరి 11 : ప్రజల శాంతి, భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్ రౌడీషీటర్లను హెచ్చరించారు. శనివారం సాయంత్రం హుమాయూన్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ మల్లేశ్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. పండుగల సమయంలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సర్వేకు వచ్చే వారికి డబ్బులు ఇవ్వొద్దు

నోడల్ అధికారి రజిత

అంబర్‌పేట, జనవరి 11 : ఇందిరమ్మ ఇండ్లకోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటి సర్వే ఆదివారం కూడా కొనసాగుతుందని జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ నోడల్ అధికారి రజిత తెలిపారు. సర్వేకు వచ్చిన సిబ్బంది ఎవరైనా ఇండ్ల పేరు చెప్పి డబ్బులు అడితే ఇవ్వొదని చెప్పారు. సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో 44,455 మంది ఇందిరమ్మ ఇండ్లకోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో ఇప్పటి వరకు 56 శాతం సర్వే పూర్తి అయిందని తెలిపారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి సహకరించాలన్నారు. ఎవరైనా, ఎక్కడైనా సర్వే సిబ్బంది డబ్బులు ఆడిగితే సర్కిల్ కార్యాలయానికి వచ్చి తనకు ఫిర్యాదు ఇవ్వాలని ఆమె అన్నారు.

గ్రేటర్ మహిళా సంఘం అధ్యక్షురాలిగా రజిత

సంఘం మహిళా నేతలకు నియామక పత్రాలను అందజేస్తున్న పుట్టి యాదగిరిముదిరాజ్

అంబర్‌పేట, జనవరి 11 : అంబర్‌పేటలోని తెలంగాణ ముదిరాజ్ సంఘం కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ మహిళా సంఘం అధ్యక్షురాలిగా నాగోల్‌కు చెందిన చిక్కుడు రజితను ఎన్నుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నాగోల్‌కు చెందిన చిలుముల సుప్రియను, ప్రచార కార్యదర్శిగా బాకారానికి చెందిన గొడుగు లక్ష్మిని ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్ రామముదిరాజ్‌తో కలిసి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా పుట్టి యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ముదిరాజ్‌లను బీసీ-ఏ, జాబితాలోకి చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్రావణ్‌ముదిరాజ్, సరసింహ ముదిరాజ్, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్యపాల్‌సింగ్

సత్యపాల్‌సింగ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాజేందర్‌పటేల్‌గౌడ్

కాచిగూడ, జనవరి 11: నింబోలిఅడ్డా కార్యాలయంలో జాతీయ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన సత్యపాల్‌సింగ్‌ను నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బీసీ కుల వృత్తుల వారికి యంత్రాలు కొనుగోలు చేయడానికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రాయితీని అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూలిజాల కృష్ణ, మెట్టు ముత్యాల్‌రావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్కర్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్, కిశోర్‌గౌడ్, పాల్గొన్నారు.

డ్రైవర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలి

కాచిగూడ, జనవరి 11: ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉంటూ డ్రైవింగ్ చేయాలని ట్రాఫిక్ ఈస్ట్‌జోన్ ఏసీపీ సంపత్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాచిగూడ, బర్కత్‌పురలోని ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ సంపత్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. డ్రైవర్లు బస్సులను బస్‌బేలోనే నిలపాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్సై అనిల్‌గౌడ్, కాచిగూడ డిపో మేనేజర్ టి.రఘు, బర్కత్‌పుర మేనేజర్ మంజుల, శ్రీనివాస్, అయోధ్య రాములు ఆంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

తెలంగాణ మెడికల్, పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియ న్ 2025 డైరీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి

సుల్తాన్‌బజార్, జనవరి 11 : వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ మెడికల్, పబ్లిక్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్(హెచ్-1) నిరంతరం ముందుండటం అభినందనీయమని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. కోఠిలోని యూనియన్ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కమిటీ 2025 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన యూనియన్ గౌరవ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి రాజశేఖర్‌లతో కలిసి 2025 డైరీని ఆవిష్కరించారు. యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ కర్న, జాయింట్ జనరల్ సెక్రటరీ అఫ్తాబ్ అహ్మద్ ఖాన్, కోశాధికారి ఏ శివకుమార్, ఉపాధ్యక్షుడు బి.నాగేశ్వర్ రావు, యాదమ్మ, సంయుక్త కార్యదర్శి అమరేశ్వరి, కార్యనిర్వాహణ కార్యదర్శులు కె.సువర్ణ, టి. సుజాత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చగిరి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నరేశ్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్ పాల్గొన్నారు.

వీడీసీసీ రోడ్డు నిర్మాణం



లంగర్‌హౌస్ డివిజన్ హాశంనగర్‌లో జీహెచ్ఎంసీ సర్కిల్ -13 ఇంజినీరింగ్ విభాగం అధికారులు వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ పనులను ఎంఐఎం నాయకుడు వజీ ఉజ్జామసిద్దీకీ, ఏరియా ప్రెసిడెంట్ షోహరబ్, మహ్మద్, అక్బర్ పరిశీలించారు.

– మెహిదీపట్నం, జనవరి 11

పెండింగ్ పనులను చేపట్టాలి

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టాలని జీహెచ్ఎంసీ సర్కిల్ -12 డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డిని మల్లేపల్లి డివిజన్ ఎంఐఎం నాయకుడు జాఫర్‌ఖాన్ కోరారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్‌ను కలి అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన డిప్యూటీ కమిషనర్ చర్యలు చేపడతామని అన్నారు.

– మెహిదీపట్నం, జనవరి 11

మాదిగ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌మాదిగ

కాచిగూడ, జనవరి 11: రానున్న ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని తెలంగాణ మాదిగ మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌మాదిగ విజ్ఞప్తి చేశారు. శనివారం బర్కత్‌పురలోని సమాజిక భవన్ మహాకూటమి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా కిరణ్‌మాదిగ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ సమన్వయకర్త దయానంద్‌రావు, మోచి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌ప్రేమ్‌రాజ్, కొండల్‌రావు, పుష్పాంజలి, జగదీశ్, సుమన్, బాలకిషన్, రాజుమాదిగ, సుధాకర్ మాదిగ, బాలస్వామి, బాలరాజు, జనార్దన్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

అబిడ్స్, జనవరి 11: అగర్వాల్ సమాజ్ తెలంగాణ, కట్ పీస్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్, హోల్‌సేల్ ఆర్ట్ సిల్క్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సహకారంతో సూరజ్‌భవన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తలసీమియాతో బాధపడుతున్న రోగుల కోసం నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం ద్వారా 314 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. తలసీమియా సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు మనీష్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం అగర్వాల్, కోశాధికారి నవీన్ అగర్వాల్, గౌరవ కార్యదర్శి కపూర్ చంద్, హైదరాబాద్ కట్‌పీస్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, ఆర్ట్ సిల్క్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతి



లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్. బీజేపీ నాయకులు ఎం. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– అబిడ్స్, జనవరి 11

ఓబన్న జయంతి



వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డెర ఓబన్న జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో గల శివాజీ విగ్రహం వద్ద ఓబన్న విగ్రహానికి వడ్డెర సంఘం నగర అధ్యక్షుడు ఎస్. శ్రీశైలం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె. శ్రీనివాస్, డి. వెంకటయ్య, కె. నరేశ్, కె. రాములు, బి. కిరణ్, కె. సతీష్, డి. పవన్, డి. గిరి, ఎస్. టిల్లుకృష్ణ, డి. శంభి తదితరులు పాల్గొన్నారు.

– అబిడ్స్, జనవరి 11

చెట్ల కొమ్మల తొలగింపు

కాచిగూడ, జనవరి 11: డివిజన్‌లోని బసంత్ కాలనీ ప్రాంతంలో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసి, వాటికి అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను కార్పొరేటర్ ఉమాయాదవ్ తొలగింపజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లోని విద్యుత్ స్తంభాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కోరారు. రమేశ్‌యాదవ్, సుభాష్‌పటేల్, సంతోష్, భీంరాజ్ పాల్గొన్నారు.

వైజయంతి, సప్తశతి, హర్షయానం గ్రంథాల ఆవిష్కరణ

వైజయంతి, సప్తశతి గ్రంథాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

రవీంద్రభారతి, జనవరి 11 : తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, ఎం.వి.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విహారి రచించిన జగన్నాథ పండిత రాయలు నవల సమీక్ష వ్యాసాల సంకలనంగా 'వైజయంతి' గ్రంథం ఆవిష్కరణ, సుధామ సంకలనంగా ఏడువందల సప్తపదులతో రూపొందిన సప్తశతి ఆవిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డా.కేవీ రమణాచారి విచ్చేసి గ్రంథాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా.వై.రామకృష్ణారావు, జి.వల్లీశ్వర్, సింహప్రసాద్, సీఎస్ రాంబాబు, మట్టిగుంట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హర్షయానం గ్రంథావిష్కరణ..

తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో హర్షవర్ధన్ రచించిన హర్షయానం గ్రంథావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారుడు (ఐఎఎస్ రి)అధికారి డాక్టర్ కేవీ రమణాచారి విచ్చేసి హర్షయానం గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆచార్య ఎన్.గోపీ సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ..ఈ హర్షయానం ఒక వ్యక్తి వైయుక్తిక అనుభవంగా కాకుండా పర్యాటక ప్రేమికులకు ఒక దిక్సూచిగా, భావోద్వేగ శిక్షణగా, సామూహిక అనుభూతికి కేంద్రంగా రూపొందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దుష్యంత్‌కుమార్, డా.ఎస్.రఘు, కిన్నెర కార్యదర్శి ముద్దాళి రఘురామ్ డా.ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల భరతనాట్యం

నృత్య అకాడమీ ఆధ్వర్యంలో జియాగూడలోని రంగనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా చిన్నారుల భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకున్నది. అదిగో అల్లదిగో, బ్రహ్మమొక్కటే వంటి ఆధ్యాత్మిక గీతాలపై జరిగిన నృత్య ప్రదర్శన భక్తులు, ప్రజలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అత్తాపూర్ లక్ష్మీరామ్ హారన్ అపార్ట్‌మెంట్‌కు చెందిన దృతిక గురువు గౌరీ నృత్య ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. (కార్వాన్, జనవరి 11)

నుమాయిష్‌లో వీకెండ్ సందడి

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో వీకెండ్ సందడి నెలకొంది. రెండవ శనివారం సెలవు దినం కావడంతో నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు నుమాయిష్‌ను తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో నుమాయిష్ కిటకిట లాడింది. స్టాల్‌లలో కొనుగోళ్లు జరగడంతో స్టాల్ యజమానులు సంతోషం వ్యక్తం చేశారు. (అబిడ్స్, జనవరి 11)

ఆశా వర్కర్ల జీతాలు పెంచాలని విన్నపం

రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశావర్కర్ల జీతాలను పెంచాలని, ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని కోరుతూ శనివారం నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌ను సీఐటీయు పార్టీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.18,000 ఇవ్వాలని సీఐటీయూ నాంపల్లి కార్యదర్శి మల్లేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో లతారాణి, సారాబాయి, రీటా తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జనవరి11

లంగర్‌హౌస్‌లో సమస్యలు పరిష్కరించండి

లంగర్‌హౌస్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు బస్తీల వాసులు ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌ను కోరారు. టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఎమ్మెల్యేను కలిసి బస్తీల సమస్యలను వివరించారు. డ్రైనేజీ, సీవరేజీ, రోడ్ల సమస్యలు ఉన్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని మహిళలు వాపోయారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో కలిసి బస్తీలలో పర్యటించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

– మెహిదీపట్నం, జనవరి 11

యువకులు ఆటల్లో రాణించాలి

మేరు కులస్తులు వివిధ రంగాలతో పాటు క్రీడారంగంలో రాణించాలని రాజ్యసభ సభ్యులు మండడి అనీల్ కుమార్‌యాదవ్ అన్నారు. మేరు కుల సంఘం అధ్వర్యంలో నిజాం కళాశాల మైదానంలో రెండు రోజులు పాటు నిర్వహించనున్న మేరు క్రికెట్ లీగ్ సీజన్-3 టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనీల్ కుమార్ యాదవ్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేరు కుల సంఘం ప్రతినిధులు కీర్తి రాజగోపాల్, ఓజోల శేఖర్, కుంటమల్ల లక్ష్మీనారాయణ, జి. అరుణ్, శ్రీపతి, సూరజ్ పాల్గొన్నారు.

– కార్వాన్, జనవరి11